పర్యావరణ సమతుల్యతను కాపాడుదాం

- మొక్కలతోనే మానవాళి మనుగడ
- వక్తలు, పర్యావరణవేత్తల వెల్లడి
- ఘనంగా పర్యావరణ దినోత్సవం


మొక్కలు నాటుతున్న దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డీసీ ముప్పాళ్ల శ్రీనివాసరావు

అగనంపూడి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. కాలుష్యాన్ని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కోరారు. మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం తదితర కార్యక్రమాల ద్వారా ప్రకృతిని సంరక్షించుకోవాలన్నారు. ప్రకృతి హిత జీవనంతోనే మానవాళి మనుగడ సాధ్యమని చెప్పారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో..

పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి దువ్వాడ వీఎస్ఈజెడ్ హరితవనాలను ఏర్పాటు చేస్తోందని దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీఎస్ఈజెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడానికి వీఎస్ఈజెడ్ మూడేళ్ల నుంచి లక్షల మొక్కలు నాటడంతో పాటు ఆవరణలోని సంస్థల యాజమాన్యాల సహకారంతో హరిత వనాలను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వీఎస్ఈజెడ్ వివిధ విభాగాల అధికారులు, వివిధ సంస్థల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

ప్లాస్టిక్ వాడకంపై పూర్తిస్థాయిలో నిషేధం విధించిననాడే పర్యావరణ సమతుల్యత సాధ్యమని జవహర్‌లాల్ నెహ్రూ రాంకీ ఫార్మా ఎండీ లాల్ కిషన్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా


విజేతలకు బహుమతులు అందిస్తున్న రాంకీ ఫార్మా ఎండీ లాల్ కిషన్

ఫార్మాసిటీ కాలనీల్లోని పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందించారు. విశాఖ ఫార్మాసిటీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఆర్ఐఎల్ ఆపరేషన్ హెడ్ చంద్రశేఖర్, రాంకీ కార్పొరేటర్ హెడ్ చక్రధర్, డీజీఎం గిరిధర్ భక్షి, రాంకీ ఫౌండేషన్ రీజనల్ ఇన్‌చార్జ్ కనుమెట్ట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ కంపెనీలో నిర్వహించిన కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కె.సురేష్‌కుమార్, కంపెనీ జీఎం రమేష్ మాట్లాడారు. తరువాత మొక్కలు నాటారు.

విజ్ఞాన్ కళాశాలలో..

దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై వీడియో ప్రదర్శన ద్వారా వివరించారు. తరువాత ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.రవీంద్ర, ఎన్ఎస్ఎస్ పీవో సుందర్‌రామమ్ పాల్గొన్నారు.

● 79వ వార్డు అగనంపూడి మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి మొక్కలు పంపిణీ చేశారు.సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, జానకి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

● అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల మైదానం


అగనంపూడి మహాత్మాగాంధీ సేవా సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ మహాలక్ష్మి

లో మొక్కలు నాటారు. హెచ్ఎం కృష్ణారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, గైడ్స్ కెప్టెన్ కృష్ణవేణి, స్కౌట్స్ మాస్టర్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐలా ఆధ్వర్యంలో..

అక్కిరెడ్డిపాలెం: మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఆటోనగర్ ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ అన్నారు. ఆటోనగర్ బీ బ్లాక్‌లోని శ్రావణి ఆర్ఎంసీ రోడ్డులో ఏపీఐఐసీ ఐలా (జీఎన్ఎంఐఏఎస్ సొసైటీ) ఆటోనగర్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని అన్ని బ్లాకుల్లో 2 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. బీ – బ్లాక్‌లో మొక్కలు నాటారు. ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, వాసీవా ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణప్రసాద్, పెదగంట్యాడ ఆటోనగర్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఐలా మాజీ ఉపాధ్యక్షుడు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్థానిక డీఏవీ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ నైస్‌షాజి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది మొక్కలు నాటారు.

● స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సెక్టార్–2 సత్యసాయి మందిరం, పరిసర ప్రాంతాల్లో సమితి సభ్యులు జామ, బాదం తదితర ఫల మొక్కలు నాటారు.' సత్యసాయి ప్రేమ తరు ' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, డి.ఎ.వి. సన్యాసిరాజు, కె.వి. రమణ,ఆర్.వి.ఆర్. మూర్తి, కె. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ

గాజువాక : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి


అగనంపూడి హైస్కూల్‌లో మొక్క నాటుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

నర్సింగరావు కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోర్టు వై జంక్షన్‌వద్ద అపార్ట్‌మెంట్ల ప్రాంగణంలో మొక్కలను నాటారు. స్థానిక నాయకులు డి.తిరుపతిరావు, జీలకర్ర రమణ, రాజశేఖర్, మూర్తి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

● సాయిరామ్‌నగర్‌కు చెందిన స్వామి విద్యానికేతన్‌లో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు.

కూర్మన్నపాలెం: ఆరోగ్యవంతమైన జీవనశైలికి ప్లాస్టిక్‌ను విడనాడి, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని జోనల్ కమిషనర్ సింహాచలం అన్నారు. 87వ వార్డు తిరుమలనగర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమరావతి పార్కు, గాంధీపార్కులో మొక్కలు నాటారు. స్థానిక వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు నాగభూషణం పాల్గొన్నారు.

గంగవరం పోర్టులో..

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్‌పై దృష్టి సారించి పర్యావరణ సుస్థిరత యొక్క ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. స్థానిక బజారుల్లో, దుకాణాల్లో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. జీవీఎంసీ నిర్వహించిన ఎకో వైజాగ్ కార్యక్రమంలో అదాని గంగవరం పోర్టు లిమిటెడ్ పాల్గొని ఆర్‌కే బీచ్‌లో గ్రీన్ ర్యాలీ నిర్వహించినట్లు పోర్టు యాజమాన్యం తెలిపింది.


గుడ్డ సంచులు అందజేస్తున్న పోర్టు ప్రతినిధులు


ఆటోనగర్ బీ బ్లాక్‌లో మొక్కలు నాటుతున్న ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు


ఉక్కు డీఏవీ పాఠశాలలో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు


మొక్కలు నాటుతున్న జెడ్సీ సింహాచలం

పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న మహిళామండలి సభ్యులు

గాజువాక : వాసవ్య మహిళా మండలి, కుషాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 67వ వార్డులోని కొత్తగాజువాక అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళా మండలి కమ్యూనిటీ కో ఆర్డినేటర్ సుశీల మాట్లాడుతూ బాలికల నుంచి రుతు విరతి మహిళల వరకు ఆరోగ్యాన్ని కాపాడుకొనే పద్ధతులు, పోషకాలు లభించే ఆహార పదార్థాల గురించి వివరించారు. రాగి పిండితో లస్సీ, రాగి పిండిలో ఉండే పోషకాలు, ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. అనంతరం రాగి లస్సీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

తాగునీరు వృథా


శివసాయినగర్‌లో వృథాగా పోతున్న తాగునీరు

కూర్మన్నపాలెం: 86వ వార్డు కూర్మన్నపాలెం పరిధి శివసాయినగర్‌లోని రోడ్ నెంబర్ 2లో తాగునీరు వృథాగా పోతోంది. పైప్ లైన్ పగిలి నీరు పోతోంది. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకవైపు వార్డులోని చాలా ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే, మరోవైపు నీరు ఇలా రోడ్డు పాలవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలి.

– ఆదారి అనిల్, శివసాయినగర్

క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


స్వామికి పూజ చేస్తున్న వేదపండితులు, ఆలయ కమిటీ చైర్మన్

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఉత్సవమూర్తికి సోమవారం పంచామృతాభిషేకాలు జరిపించారు. సాయంత్రం కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఈ.కె.చారి దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో సాగినాయుడు, నర్సింగరావు, ఎం.ఉమామహేశ్వరరావు, గురునాథ్, కృష్ణారావు, సోమశేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం


శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

అగనంపూడి: జీవీఎంసీ ఆధ్వర్యంలో అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేసవి క్రీడా శిబిరం సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధి బలిరెడ్డి శ్రీను మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా శిబిరం వల్ల పిల్లలకు సెలవులు సద్వినియోగమయ్యాయన్నారు. ముందుగా ఒడిశా రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి మౌనం పాటించి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, కమిటీ సభ్యులు సింగిడి సింహాచలం, దాసరి సత్యవేణి, బలిరెడ్డి సత్యనారాయణ, కోచ్‌లు రూపారాణి, సీహెచ్.అప్పారావు, ఎం.రంగారావు, కోఆర్డినేటర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నారావు మృతి తీరని లోటు


సంతాప సభలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారామ్

అగనంపూడి: సీఐటీయూ అగనంపూడి ఇన్‌చార్జి ఉప్పల కన్నారావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటని ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ , 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ అన్నారు. అగనంపూడి దిబ్బపాలెంలో సోమవారం నిర్వహించిన కన్నారావు సంతాప సభలో పాల్గొన్న వారు, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, సీపీఎం, టీడీపీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాయామ శిక్షణ


వ్యాయామ సాధన చేస్తున్న చిన్నారులు

గాజువాక : గాజువాక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు సోమవారం వ్యాయామ శిక్షణ నిర్వహించారు. వ్యాయామంలో రకాలు, ప్రతిరోజు వ్యాయామం చేయడంవల్ల కలిగే ప్రయోజనాలను గ్రంథాలయాధికారి బి.చంద్రకళ వివరించారు. అనంతరం విద్యార్థులతో సాధన చేయించడంతో పాటు వివిధ రకాల ఆటలను ఆడించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్దేశ్వరం గ్రామం తోటవీధిలోని కమిటీ హాలు ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ. 11.25 లక్షలతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రతి వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి, ఏఈ ఎస్.వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, స్థానిక నాయకులు ఎస్.వై. నాయుడు, గౌరుసు సత్యం, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఉక్కు కర్మాగార పరిరక్షణ ప్రజలందరి బాధ్యత

కూర్మన్నపాలెం : వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 844వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని పార్లమెంట్‌లో నాయకులు గళమెత్తాలన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కోవడం కోసం కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూర్మన్నపాలెం : ఆర్థిక వివాదంతో వచ్చిన నిందారోపణల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్‌కు చెందిన అడుసుమిల్లి వీర శంకరరావు(37) ఐఎన్ఎస్ క్యాంటీన్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో క్యాషియర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కంపెనీకి చెందిన ఆర్థిక లావాదేవీల్లో వివాదాలు తలెత్తడంతో వచ్చిన నిందారోపణల వల్ల వీర శంకరరావు మనస్తాపానికి గురై రాజీవ్‌నగర్‌లోని మూడంతస్తుల భవనం మీద నుండి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. దువ్వాడ పోలీసులు ఆత్మహత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

11న ప్రతిష్టాత్మకంగా అమిత్ షా సభ

గాజువాక : నగరంలో ఈ నెల 11న నిర్వహించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభను బీజేపీ కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ కోరారు. గాజువాక బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధిని ఈ సభలో వివరిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, గూటూరు శంకరరావు, బాటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎన్ మాధవ్

రోడ్డు పైనే దుకాణాలు

- దుకాణాల ఏర్పాటులో చక్రం తిప్పుతున్న టీడీపీ నాయకుడు
- అక్రమంగా వసూళ్లు
- జీవీఎంసీ ఆదాయానికి గండి
- ట్రాఫిక్ సమస్యతో వాహనచోదకుల అవస్థలు


ముస్తఫా జంక్షన్‌లో అనధికారికంగా వెలసిన దుకాణాలు


రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలు

కూర్మన్నపాలెం: గాజువాక ప్రాంత పరిధిలో వడ్లపూడి నుంచి కూర్మన్నపాలెం వరకు రోడ్లపై ఇటీవల ఇష్టానుసారం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వడ్లపూడి కూర్మన్నపాలెం, ముస్తఫా జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు అధిక సంఖ్యలో వెలిశాయి. కొనుగోలుదారులతో ఈ ప్రాంతమంతా రద్దీగా మారుతుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

గతంలో గాజువాక, వడ్లపూడి తదితర మార్కెట్లను తాత్కాలికంగా మూసివేయడంతో దుకాణదారులు ఇలా ప్రధాన రోడ్లపై దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు మొదలుపెట్టారు. దీంతో దుకాణాలకు వచ్చేవారితో ఆ ప్రాంతంలో రద్దీ నెలకొంది. వాహనాలు పార్క్ చేసుకోవడానికి సరైన పార్కింగ్ స్థలం లేక, వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. ఇదే అదనుగా భావించిన ఓ టీడీపీ నాయకుడు ముస్తఫా జంక్షన్ నుంచి వడ్లపూడి పోస్టాఫీస్ వరకు ఉన్న 60 అడుగుల రోడ్డుకు ఇరువైపులా అనధికార దుకాణాలను ఏర్పాటు చేశాడు. ఈ దుకాణాలను చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చి, అక్రమ వసూళ్లకు పాల్పడుతూ జీవీఎంసీలో అన్నీ తానే అంటూ చక్రం తిప్పుతున్నాడు. ఒక్కొక్క దుకాణానికి ఒక్కో రేటు పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నాడు. జీవీఎంసీ అధికారులు సైతం మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇక్కడ ఉన్న బోరును కూడా ప్రజలు వాడుకోనివ్వకుండా ఆ ప్రాంతంలో దుకాణాలను ఏర్పాటు చేయడంతో, అది నిరుపయోగంగా మారింది. ప్రజల ఫిర్యాదు మేరకు కంటితుడుపు చర్య చేపట్టిన జీవీఎంసీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తున్న వారిని ఖాళీ చేయాలని సూచించారు.

దుకాణాలు కేటాయించినా..

వ్యాపారులు మాత్రం వడ్లపూడి రైతు మార్కెట్‌లో దుకాణాలను కేటాయించినా, అక్కడికి వెళ్లకుండా రోడ్లపైనే వ్యాపారాలు సాగుతున్నాయంటూ అక్కడే ఉంటుండడంతో సమస్యకు పరిష్కారం లభించడం లేదు. రోడ్లపై దుకాణాలను ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పారిశ్రామిక ప్రాంతం గాజువాక నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ముస్తఫా జంక్షన్ మీదుగా రోజూ వందల మంది ప్రయాణిస్తుంటారు. కాలేజీలు, ఉద్యోగాలు, ఆస్పత్రులకు వెళ్లాల్సిన వారు ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. అయితే ఈ రోడ్లపై దుకాణాల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య తలెత్తి, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై పార్క్ చేస్తున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నా, వాహనాలు పార్క్ చేయడం మానడం లేదని, రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వారికి అవగాహన కలిగిస్తున్న మార్పు రావడంలేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న ఆ టీడీపీ నాయకుడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, రోడ్లపై వ్యాపారాలు సాగించేవారిని మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకునే విధంగా తరలించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం

మా ప్రాంతంలో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తుండడంతో రోడ్డు ఇరుగ్గా మారి ప్రయాణించే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వ్యాపారులు ఇల్లా రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. జీవీఎంసీ అధికారులు స్పందించి చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే బాగుంటుంది.

– కీర్తి నాగు, కూర్మన్నపాలెం

చర్యలు తీసుకోవాలి

దుకాణాల వద్ద కొనుగోలు చేయడానికి వచ్చేవారితో మా ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉంటోంది. వినియోగదారులు తమ వాహనాలను కూడా రోడ్డుపైనే పార్క్ చేస్తుండటంతో రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నాం. రోజురోజుకు దుకాణాలు ఏర్పాటు చేసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇప్పటికైనా దుకాణాలు నడుపుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి

– దవళ రాజు, ముస్తఫా జంక్షన్

వ్యక్తిపై రాళ్లతో దాడి

కూర్మన్నపాలెం: విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ వ్యక్తిపై మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి.. అగనంపూడి ప్రాంతానికి చెందిన ఖండేపల్లి కృష్ణ(33) ఫార్మాసిటీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా అగనంపూడి కొండయ్యవలసకు చెందిన అమరపిన్ని లోవరాజు, బలిరెడ్డి నీరజ్ రహదారిపై మద్యం సేవించి అటుగా వస్తున్న కృష్ణపై రాళ్లతో దాడి చేశారు. గాయాలపాలైన కృష్ణ దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐటీయూసీ రక్తదాన శిబిరం రేపు

ఉక్కునగరం: స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో సెక్టార్–5 అంబేద్కర్ కళాక్షేత్రంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు, ట్రైనీలు పాల్గొని రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు.నెట్/స్లెట్/పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు వారి విద్యార్హత, బోధన అనుభవంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక జెరాక్సుసెట్‌తో డెమో క్లాస్‌లు నిర్వహించడానికి ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు.